
Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | గురువారం మే 22 2025 | సంపుటి:2 సంచి 233 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-



## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

- ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం

తెలంగాణవీణ, న్యూఢిల్లీ,

దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్ర లో ఏకంగా -మిగతా 2 లో



## ప్రచారం కోసం ఇంతగా దిగజారాలా

- అశోక వర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్‌కు చివాట్లు
- బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

తెలంగాణవీణ, న్యూఢిల్లీ,

హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మదాబాద్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఆయన పెట్టిన పోస్టును ఉద్దేశిస్తూ న్యాయస్థానం మందలించింది. పబ్లిసిటీ పొందేందుకు ఇలాంటి చర్యలు ఎందుకంటూ ప్రశ్నించింది. తనకు బెయిల్ మంజూరుచేసి విచారణ నిలిపివేయాలని ఇటీవల అలీఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

-మిగతా 2 లో


## ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

### పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవడంలో విఫలం

- ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ
- తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యం
- రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్

తెలంగాణవీణ, హైదరాబాద్,

మోదీ ప్రభుత్వం ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గాం దాడి తర్వాత దేశం అంతా ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచిందని.. కానీ పాకిస్తాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా మోదీ ప్రభుత్వం వెనకడుగు వేసిందని.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని విమర్శించారు. బుధవారం -మిగతా 2 లో





## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

- కేసీఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర
- ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం
- కేసీఆర్‌కు నోటీసులపై కేటీఆర్ విమర్శలు

తెలంగాణవీణ, నల్లగొండ,

నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్ -మిగతా 2 లో



## ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

- ప్రతికూల వాతావరణ పరిస్థితులు

తెలంగాణవీణ, నల్లగొండ,

తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసర ల్యాండింగ్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం మేళ్లచెరువులో హెలికాప్టర్ ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, కమ్ముకున్న మబ్బులు, గాలివాన నేపధ్యంలో అప్రమత్తమైన పైలట్ వాతావరణ శాఖ సూచన మేరకు కోదాడలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. కోదాడ నుంచి హుజూర్ నగర్ కు రోడ్డు మార్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్ బయలుదేరుతారని అధికారులు వెల్లడించారు.

## బలూచీ పేలుడులో భారత్ హస్తం

### పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన ఇండియా

తెలంగాణవీణ, న్యూఢిల్లీ

బలోచిస్థాన్‌లో పాఠశాల బస్సు లక్ష్యంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో పలువురు చిన్నారులు మృతి చెందారు. అయితే ఈ విషయంలో భారత్ ప్రమేయం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. సొంత వైఫల్యాల నుంచి ప్రపంచ దృష్టిని మరల్చే ప్రయత్నంలో భాగంగా -మిగతా 2 లో




## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు


- ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ

విశాఖపట్టణం/హైదరాబాద్,

తెలుగు రాష్ట్రష్టాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత -మిగతా 2 లో







## తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్

### మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం

### ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతం

- ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా
- వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం
- గణపతి తరవాత బాధ్యతలు చేపట్టిన నంబాల
- కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి

తెలంగాణవీణ, బీజాపూర్,

ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహా మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు -మిగతా 2 లో



## ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు

- కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం
- నోటీసులు అందాక స్పందిస్తా..విచారణకు హాజరవుతా
- మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ స్పష్టీకరణ



తెలంగాణవీణ, హైదరాబాద్,

కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ..కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం -మిగతా 2 లో

# ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిన మోడీ

(మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ దేశానికి వన్నె తెచ్చిన నేత రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా కొనియాడారు. 18 ఏండ్లకే యువతకు ఓటు హక్కు కల్పించారని.. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని అన్నారు. 1971 పాకిస్తాన్ పై ఇందిరా గాంధీ యుద్ధం చేసి బలమైన గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. పాక్ ను రెండు ముక్కలు చేసి శాస్వత గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్ పై తీవ్ర వాద ముసుగులో దాడి జరిగితే ఇందిరాగాంధీ తెగువ గుర్తు చేసుకొస్తుందని అన్నారు. దాదాపు 54 ఏండ్ల తర్వాత కూడా ఉక్కు మహిళ తెగువను ప్రపంచం గుర్తు చేసుకుంటుందని అన్నారు. తీవ్రవాదంపై పోరాడటం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ కేంద్రానికి అండగా నిలిచామని.. క్యాండిల్ ర్యాలీతో తెలంగాణలో కేంద్రానికి మద్ధతుగా ర్యాలీ చేశామని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా కంగ్రెస్ తో పాటు ప్రజలందరూ అండగా ఉన్నప్పటికీ.. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి వచ్చిన అవకాశాన్ని మోదీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. పాకిస్తాన్ విషయంలో అమెరికాకు లొంగిపోయి వెనకడుగు వేసిన మోదీ.. గొప్పల కోసం పార్టీ శ్రేణులను వీధుల్లో తిప్పుతున్నారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచక్షణ కోల్పోయి రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మొట్టమొదట కేంద్రానికి అండగా నలిచింది తెలంణ ప్రభుత్వమని. క్యాండిల్ ర్యాలీ తీసి కేంద్రానికి, బలగాలకు అండగా నిలిచామని అన్నారు. ఆ రోజు తాము చేసిన దానికి అభినందించడానికి నోరు కూడా రాలేదని విమర్శించారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం అసువులు బాసారని, రాజీవ్ విగ్రహంపై సంకుచిత ఆలోచనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ రోజు దేశం అంతా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల త్యాగాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్య్రం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దేశ ప్రజల హక్కులను, స్వాతంత్యాన్ని కాపాడటానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.

## బలూచీ పేలుడులో భారత్ హస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. అంతేకాకుండా స్థానిక సమస్యలకూ భారత్‌ను నిందించడం దాయాది దేశానికి అలవాటుగా మారిందని మండిపడింది. 'ఖుజ్దార్‌లో చోటుచేసుకున్న దాడిలో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తున్నాం. అటువంటి ఘటనల్లో మరణించిన వారికి భారత్ సంతాపం తెలిపింది. అయినప్పటికీ.. సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం తోపాటు ఉగ్రవాదానికి అంతర్జాతీయ కేంద్రంగా పేరుగాంచిన వారు, ప్రపంచ దృష్టి మరల్చేందుకు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారు. వారి అంతర్గతంగా ఉన్న అన్ని సమస్యలకు భారత్‌ను నిందించడం పాక్‌కు పరిపాటిగా మారింది' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచాన్ని మోసగించేందుకు పాక్ చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలు విఫలం అవుతున్నాయని అన్నారు. బలోచిస్థాన్‌లోని ఖుజ్దార్ ప్రావిన్స్‌లో ఓ పాఠశాల బస్సును లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. 38 మంది తీవ్రంగా గాయపడ్డారు. అక్కడి వేర్పాటువాద గ్రూపులు ఈ దాడికి పాల్పడివుండవచ్చని అనుమానిస్తున్నారు.

## ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది.

## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు


(మొదటి పేజీ తరువాయి)

బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్టాల్లో కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది.

## తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘడ్

(మొదటి పేజీ తరువాయి)

(70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ.1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని అమిత్ షా ఎక్స్‌లో



పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళు ఉన్నారు. కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్ధాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు.

## ప్రచారం కోసం ఇంతగా దిగజారాలా

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈసందర్భంగా అలీఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. తన క్లయింట్ ఆ పోస్టులో నేరపూరిత ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలు ఏమున్నాయ్ అని వాదించారు. ఆయన వాదనపై స్పందిస్తూ జస్టిస్ కాంత్ మాట్లాడారు. 'అసలు ఏం జరుగుతోందో మీరు తెలుసుకోండి. భావ వ్యక్తీకరణ చేసే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం గురించి మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. భారత్‌కు స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి అందరూ హక్కుల గురించి మాట్లాడుతున్నారు. కానీ, బాధ్యతల గురించి ప్రస్తావించడం లేదు. భావ వ్యక్తీకరణ చేసే హక్కు కచ్చితంగా ఉంటుంది. కానీ, వీటన్నింటి గురించి మాట్లాడే సమయం ఇదేనా..? కొందరు రాక్షసులు వచ్చి భారత్‌పై దాడి చేశారు. ఇప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలి. ఇలాంటి సమయంలో పబ్లిసిటీ పొందేందుకు ప్రయత్నాలు ఎందుకని మందలించారు. కాగా.. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న కారణంతో హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. రాజనీతి శాస్త్ర విభాగంలో అలీఖాన్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశాల్లో వివరించిన కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను ఆయన తప్పు పట్టారు. 'ప్రభుత్వం తరఫున మాట్లాడుతున్న వారు క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవాలను మాత్రమే వివరించాలి. లేకపోతే అది వంచనే అవుతుంది' అని పోస్టు పెట్టారు.

## దేశంలో మళ్లీ కరోనా బెల్స్

(మొదటి పేజీ తరువాయి)

వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్ట్‌లు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది.

సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమిషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్-ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



# ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహం..

## రైలు నుంచి విసిరేసినట్లు అనుమానం



**తెలంగాణవీణ, బెంగళూరు**

రైల్వే వంతెన సమీపంలో ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేస్తున్నారు. యువతిని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి కదులుతున్న రైలు నుంచి బయటకు విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం హొసూర్ ప్రధాన రహదారిలోని పాత చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో, రైలు పట్టాల దగ్గర నీలం రంగులో ఉన్న ట్రావెల్ సూట్‌కేస్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రావెల్ బ్యాగ్‌లోని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. హతురాలి వయసు 18 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. ఆమెను ఎక్కడో హత్య చేసి సూట్‌కేసులో మృతదేహాన్ని కుక్కి కదులుతున్న రైలు నుంచి విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. తమ ప్రాంతం పరిధిలో మృతదేహం లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు వివరించారు.

# ఆర్మీ స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి..

## నలుగురు పిల్లలు మృతి



**తెలంగాణవీణ,**

భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న దాయాది దేశం పాకిస్థాన్ లో తాజాగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఓ పాఠశాల బస్సును సూసైడ్ బాంబ్ కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు.స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీ పబ్లిక్ స్కూల్ కు చెందిన బస్సు ఈ ఉదయం పిల్లల్ని తీసుకొని వెళ్తోంది. ఆ సమయంలో దానిని లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది. సూసైడ్ బాంబ్‌తో వచ్చిన కారు బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటన బలోచిస్థాన్ లోని కుజ్‌దార్ ప్రావిన్స్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనలో నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 38 మంది గాయపడినట్లు కుజ్‌దార్ జిల్లా సీనియర్ అధికారి యాసిర్ ఇక్బార్ దస్తి తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ పిల్లల్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఈ దాడిని పాకిస్థాన్ ఇంటీరియర్ మినిస్టర్ మొహసీన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. ఇక ఇప్పటివరకు ఏ గ్రూపు ఈ దాడికి బాధ్యత వహించలేదు.

GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**తెలంగాణవీణ, రామారెడ్డి**

విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం% మండలంలోని ఘన్పూర్ (ఆర్) కు చెందిన భూక్యరాజు (35) ఉదయం గం,10 లకు తన సొంత పొలంలో గేట్ల పైన గల మొక్కలను తొలగిస్తున్న తరుణంలో, విద్యుత్ బోరుకు సరపర అవుతున్న విద్యుత్ సర్వీసు వైరు ప్రమాదవశాత్తు గొడ్డలికి తగిలి అతని చేతి పై పడటంతో విద్యుత్ షాక్ తో గాయాలవడంతో, చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నవీన్ చంద్ర తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లల గలరు.

# భారీగా పెరిగిన ఆసియా సింహాల సంతతి..

## – ప్రకటించిన గుజరాత్ సీఎం



**తెలంగాణవీణ, గుజరాత్**


గుజరాత్ లో ఆసియా సింహాల సంతతి భారీగా పెరిగింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు సింహాల జనాభాపై నిర్వహించిన 2025 గణాంకాలను విడుదల చేశారు. ఐదేళ్ల క్రితం 674గా ఉన్న సింహాల సంఖ్య ఈ ఏడాది ఇప్పటి వరకూ 891కి పెరిగినట్లు చెప్పారు.మీడియాతో బుధవారం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆసియా సింహాల సంఖ్య 891కి పెరిగింది అని ప్రకటించారు. జూన్ 2020లో ఆ సంఖ్య 674గా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఈ సింహాలు జీవిస్తున్నట్లు చెప్పారు. జునాగఢ్, గిర్ సోమనాథ్, భావ్‌నగర్, రాజ్‌కోట్, మోర్బి, సురేంద్రనగర్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, అమ్రేలి, పోర్ బందర్, బోటాడ్‌లో ఈ సింహాలు విస్తరించినట్లు సీఎం చెప్పారు. మే 10– 11 తేదీల్లో సింహాల ప్రాథమిక జనాభా గణన నిర్వహించగా, తుది జనాభా గణనను మే 12–13 తేదీల్లో ప్రాంతీయ, జోనల్, సబ్–జోనల్ అధికారులు, ఎన్యూమరేటర్లు, అసిస్టెంట్ ఎన్యూమరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు సహా 3,000 మంది స్వచ్ఛంద సేవకుల సహాయంతో నిర్వహించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అటవీ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో గిర్ అడవుల్లోని సింహాల సంఖ్య పెరుగుతోందని ఆయన తెలిపారు.

# ‘గోల్డెన్ డోమ్’ ప్లాన్ ప్రకటించిన ట్రంప్

## 175 బిలియన్ల డాలర్లతో క్షిపణి రక్షణ వ్యవస్థ..

**తెలంగాణవీణ, న్యూయార్క్**

భవిష్యత్తు రాబోయే యుద్ధాలను దృష్టిలో పెట్టుకుని అమెరికా సమాయత్తమవుతున్నది. ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇవాళ భారీ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్‌లోని ఐరన్ డోమ్ తరహాలో.. అమెరికాకు గోల్డన్ డ్రోమ్ ను రూపొందించనున్నట్లు చెప్పారు. సుమారు 175 బిలియన్ల డాలర్ల ఖర్చుతో ఆ డోమ్‌ను నిర్మించనున్నారు. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, ఇతర వైమానిక దాడుల నుంచి అమెరికాను కాపాడుకునేందుకు గోల్డన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందించనున్నట్లు ట్రంప్ చెప్పారు. గోల్డన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థ తన పదవీ కాలం ముగిసేలోగా వినియోగంలోకి వస్తుందన్నారు.రాబోయే రోజుల్లో అమెరికాకు వైమానిక దాడుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, ముఖ్యంగా బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఓ కొత్త ప్లాన్‌ను ప్రకటిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గోల్డన్ డోమ్ కోసం ఈ సారి బడ్జెట్‌లో 25 బిలియన్ల డాలర్లు కేటాయించినట్లు చెప్పారు. మునుముందు ఆ డోమ్ కోసం భారీగా ఖర్చు చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అత్యాధునిక ఆయుధాలు శత్రువుల వద్ద ఉన్నాయని, దానికి తగినట్లు రక్షణ వ్యవస్థను తయారు చేసుకోవాలన్నారు. గోల్డెన్ డోమ్ ప్రాజెక్టు నిర్మాణ పనులను స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లైన్‌కు అప్పగించారు. స్పేస్ ఫోర్స్‌లో ప్రస్తుతం ఆయన స్పేస్ ఆపరేషన్స్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. ఏరియల్ దాడుల్ని



అడ్డుకునేందుకు కావాల్సిన వ్యవస్థను రూపొందించాలని, దానికి కావాల్సిన ప్రణాళికలను తయారు చేయాలని ట్రంప్ ఇటీవల రక్షణ శాఖను ఆదేశించారు. దాని ప్రకారమే గోల్డెన్ డోమ్ కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. వైట్‌హౌజ్‌లోని ఓవల్ ఆఫీసులో ట్రంప్ మాట్లాడుతూ.. భూమి, ఆకాశం, నీటి యుద్ధాల్లో వాడే టెక్నాలజీ ఆయుధాలను ఎదుర్కొనే రీతిలో మిస్సైల్ రక్షణ వ్యవస్థ పనిచేయనున్నట్లు తెలిపారు. అంతరిక్ష ఆధారిత సెన్సార్లు, ఇంటర్‌సెప్టార్లను కూడా తయారు చేయనున్నారు. గోల్డెన్ డోమ్ రూపకల్పన కోసం కెనడాను కూడా భాగస్వామ్యం కావాలని కోరినట్లు ట్రంప్ వెల్లడించారు. డోమ్ ప్రాజెక్టులో తాము కూడా ఆసక్తిగా ఉన్నట్లు ఇటీవల ఆ దేశ రక్షణ శాఖ మంత్రి బిల్ బ్లెయిర్ తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అది కీలకమైందన్నారు. గోల్డెన్ డోమ్ పని తీరు గురించి వివరిస్తూ.. ఇతర ప్రపంచ దేశాల నుంచి ప్రయోగించిన క్షిపణులను కూడా ఆ వ్యవస్థ అడ్డుకోగలదని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన ఐరన్ డోమ్‌ను ప్రేరణగా తీసుకుని దీన్ని డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. రాకెట్లు, మిస్సైళ్లను తిప్పికొట్టేందుకు ఇజ్రాయిల్ 2011 నుంచి ఐరన్ డోమ్‌ను వాడుతున్నది. అయితే గోల్డెన్ డోమ్‌ను అత్యంత భారీ సైజులో నిర్మించనున్నారు. వివిధ రకాల దాడుల్ని తిప్పికొట్టే రీతిలో దాన్ని తయారు చేయనున్నారు. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో ప్రయాణించే హైపర్‌సోనిక్ మిస్సైళ్లను కూడా అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆకాశంలోనే శత్రువు ఆయుధాలను చిత్తు చేయనున్నట్లు చెప్పారు. డోమ్ సక్సెస్ రేటు 100 శాతం ఉంటుందన్నారు. మిస్సైళ్లను లాంచ్ చేసే సమయంలోనైనా, లేదా అవి మార్గమధ్యంలో ఉన్న సమయంలోనైనా.. వాటిని అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్ పనిచేస్తుందని అమెరికా అధికారులు చెబుతున్నారు. చాలా రకాల వ్యవస్థలన్నీ.. ఒక సెంట్రలైజ్డ్ కమాండ్ కింద పనిచేస్తాయని రక్షణ శాఖ అధికారులు పేర్కొన్నారు. రాబోయే 20 ఏళ్లలో ఆ డోమ్ కోసం సుమారు 542 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసే అవకాశాలు ఉన్నాయి. రష్యా, చైనా దేశాలు మిస్సైల్ టెక్నాలజీలో దూసుకెళ్తున్నాయని, అయితే ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు ఆ టెక్నాలజీని ఢీకొట్టే రీతిలో లేవని, దాని కోసమే గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్నట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు.

# సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ది పొందారు

## ప్రత్యేక కోర్టులో ఇడి సంచలన ఆరోపణలు

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు లబ్ది పొందారని పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ది పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా




విచారణ జరిగింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే పక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# సంపాదకీయం

## బహిర్గతం చేయరాని విషయాలపై వ్యాఖ్యలా?

దేశ సార్వభౌమాధికార విషయంలో ఏ పార్టీ అయినా ఒక్కటిగా ఉండాల్సిందే. అంతర్జాతీయ విషయాల్లో ఏకముఖంగా సాగాలి. ఇటీవలి పాక్‌తో కాల్పుల ఘటనకు సంబంధించి అందరూ ఒక్కతాటిపైనే ఉన్నట్లు కనిపించినా మెల్లగా స్వరం మారుస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తీరు అనుమానాస్పదంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల వ్యాఖ్యలు రక్షణ దళాల సమర్థతను శంకించేలా ఉన్నాయి. నిజానికి పహల్గామ్ దాడి తరవాత కూడా పిచ్చికూతలు కూసిన వారి వ్యాఖ్యలను పాకిస్థాన్ రికార్డు చేసి, వాటిని ప్రపంచ దేశాల ముందుంచింది. పహల్గామ్ దాడి విషయంలో హిందువువేనా అని నిర్ధారించుకుని కాల్పులు జరిపారు. దీనిపై కొందరు నేతలు అవాకులు చవాకులు పేలారు. అదంతా ఉత్తిదేనని, అలాంటిదేమీ జరగేలదని కొందరు అన్నారు. ఇప్పుడేమో ఖర్గే, అసలది యుద్దమే కాదు..చిన్న యుద్దమే అంటూ దీరాలు తీస్తున్నారు. రాహుల్ మాత్రం మనవి ఎన్ని విమానాలు కూలాయని ఆరా తీస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలు. అనుమానాలు ఉంటే రక్షణశాఖ అధికారులను కలిసి తెలుసుకోవచ్చు. అలాగే తెలుసుకున్న సమాచారాన్ని గుట్టు చప్పుడు కాకుండా కాపాడుకోవాలి. తాజాగా జరిగిన భారత్‌-పాకిస్తాన్ ఘర్షణలతో అర్దాంతరంగా రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకోవడం వెనక కారణాలు చెప్పాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ తదితర పార్టీల తీరు కేవలం పాక్‌కు మాత్రమే అనుకులంగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఇది చిన్నపాటి యుద్దమేనని, కాల్పులు ఎందుకు ఇరమించారని నిలదీస్తున్నారు. మనవి ఎన్ని విమానాలు కూలాయని రాహుల్ అంటున్నారు. శశిథరూర్‌ను విదేశీశాకు వెళ్లే బృందందలో ఎంపిక చేస్తే తట్టుకోవడం లేదు. గతంలో ఐక్యరాజ్యసమితిలో పనిచేసిన అనుభవం థరూర్‌కు ఉంది. ఇకపోతే అమెరికా తీరు కూడా అనుమానాస్పదంగా ఉంది. పాక్, భారత్ ఘర్షణలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అకస్మాత్తుగా తామే రెండు దేశాలను ఒప్పించి, కాల్పుల విరమణకు దోహదం చేశామని చెప్పుకోవడం ..తరవాత నా ప్రమేయం లేదనడం వంటివన్నీ చూస్తున్నాం. అయితే ఇందులో అమెరికా ప్రమేయం లేదని భారత్ పదేపదే స్పష్టం చేస్తూ రావడం గమనిస్తే తెరవెనుక చీకటి రహస్యాలు దాగి ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. ముందురోజు కూడా ఈ ఘర్షణ విషయంలో జోక్యం చేసుకోనని చెబుతూ వచ్చిన అమెరికా అంత అకస్మాత్తుగా ఎందుకు కాల్పుల విరమణ జరపాలని రెండు దేశాలపై ఒత్తిడి తెచ్చిందన్నది కూడా ముఖ్యమే. ఇజ్రాయిల్‌ను, రష్యాను ఇలాంటి సందర్భాల్లో ఒత్తిడి చేయలేక పోయింది. తన మాట వినకపోతే వాణిజ్య సంబంధాలు నిలిపివేస్తామని బెదిరించడంతో రెండు దేశాలు దారికి వచ్చాయని స్వయంగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో పాకిస్తాన్ అణుస్థావరం అని చెబుతున్న కిరానా హిల్స్ వద్ద భారత్ వైమానిక దళం క్షిపణులు ప్రయోగించడంతో అణుధార్మికత లీకేజీ జరగడంతో అమెరికా రంగంలోకి దిగి ఒత్తిడి తెచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది.అయితే, అక్కడ అణుస్థావరం ఉన్నట్లు తమకు తెలియదని, ఆ ప్రాంతంలో అసలు తాము క్షిపణులనే ప్రయోగించలేదని భారత వైమానిక దళాధికారి స్పష్టం చేశారు. కిరానా హిల్స్ లో ఎలాంటి లీకేజీ జరగలేదని 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఎమ్జ్గ్గ÷న్సీచెబుతోంది. అసలు కిరానా హిల్స్‌పై వస్తున్న వార్తలపై పాకిస్తాన్ ఎందుకు మౌనం పాటిస్తోంది? దాయాది దేశం కిరానా హిల్స్ విషయంలో ఏమైనా దాచిపెడుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగించ డానికి సిద్ధమవుతుండగా, కట్టడి చేసేందుకు భారత్ క్షిపణి ప్రయోగించిందనే కథనాలు కూడా వెలువడ్డాయి. అణుదాడుల గురించి దాయాది దేశం నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాజాగా తేల్చి చెప్పారు. బరోవైపు పాక్ అణుదాడి హెచ్చరికలను ప్రధాని మోడీ కూడా కొట్టి పారేశారు. ఇలాంటి హెచ్చరికలతో భారత్‌ను బెదరించలేదరని అన్నారు. కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వస్త్రాల స్థావరం ఉందని, రెండు దేశాల ఘర్షణ ఆ ప్రాంతానికి ఎక్కడ విస్తరిస్తుందో అన్నభయంతోనే కాల్పుల విరమణ జరిగే విధంగా రెండు దేశాలకు అమెరికా నచ్చచెప్పే ప్రయత్నం చేసిందని భావించాల్సి వస్తుంది. ఆ ప్రయత్నం కూడా రష్యా- ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల మాదిరిగా సుదీర్ఘంగా చర్చలతో కాలయాపన చేయకుండా తక్షణమే అమలులోకి వచ్చే విధంగా ప్రయత్నం జరిగిన్నట్లు స్పష్టం అవుతుంది. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ఈ ఘర్షణలతో జరిగిన దాడులు, నష్టాల వివరాల గురించి పలువురు ఎంపిలు ప్రశ్నించగా 'జాతీయ భద్రత' దృష్ట్యా అటువంటి వివరాలు వెల్లడించ లేమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఇటీవల చోటు చేసుకున్న భారత్ పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ప్రభుత్వ వాదనను విశ్వసించాల్సిందే. ఇందులో ఈకలు పీకాల్సిన పనిలేదు. గతంలో ఇందిర చేసిందే యుద్దం.,.మోడీ యుద్దం ఏమీ చేయలేదనడం కూడా సరికాదు. కాంగ్రెస్ నేతలు ఆచితూచి మాట్లాడితే మంచిది.

# హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

-ఉరుములు,మెరుపులతో దంచికొట్టిన వాన
-లోతట్టు ప్రాంతాలు జలమయం..ట్రాఫిక్‌కు అంతరాయం
-తెలంగాణ జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ వర్షం



**తెలంగాణవీణ, హైదరాబాద్**

క్పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, తిరుమలగిరి, బేగంపేట, అల్వాల్, సైదాబాద్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడా, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డలో వర్షం పడుతోంది. దీంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం పడింది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షం పడింది. వర్షం ధాటికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతుండటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, నర్సింహులపేటలో భారీ వర్షం కురుస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం మేఘావృతమైంది. భారీ వర్షం కురుస్తోండటంతో ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, కోదాడ, నల్లబండగూడెం, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. సూర్యాపేట జిల్లాలోని నల్లబండగూడెం సమీపంలో ఓ చెట్టు కింద మేకల మందపై పిడుగు పడటంతో 39 మేకలు మృతిచెందాయి. అయితే మరో ఐదు రోజులు భారీ వర్షసూచన ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో వర్షం కురుస్తోంది. నర్సంపేట, ఖానాపురం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. బుధవారం తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌తో పాటు సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. పలుచోట్లు పిడుగులు పడే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

# సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నాం

**- ప్రధాని నరేంద్ర మోదీ**



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**

ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావు సహా 27 మంది నక్సల్స్‌ని భద్రతా బలగాలు హతమార్చాయి. సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆపరేషన్‌లో చాలా మంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడ్డారని అంచనా. ఎన్‌కౌంటర్‌లో డీఆర్‌జీ జవాన్ అమరుడయ్యాడు. ఈ ఆపరేషన్‌లో మరికొందరు జవాన్లు గాయపడ్డారు. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక కీలక నేత సహా 27 మావోయిస్టులను మట్టుబెట్టడంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా భద్రతా బలగాలను ప్రశంసించారు.సాయుధ దళాలను చూసి గర్వపడుతున్నామన్నారు. మావోయిజం ముప్పును తొలగించేందుకు, ప్రజలకు శాంతియుత, ప్రగతిశీల జీవితాన్ని అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని 'ఎక్స్' వేదికగా స్పందించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. నక్సల్స్ నిర్మూలన ఇదో మైలురాయి విజయమని పేర్కొన్నారు. సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి, అగ్ర నేత, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం ఉన్నారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల పోరాటంలో ప్రధాన కార్యదర్శి హోదా కలిగిన నేతను దళాలు మట్టుబెట్టడం ఇదే తొలిసారని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలను అభినందించారు. 2026 మార్చి 31లోగా నక్సలిజాన్ని అంతమొందిస్తామని షా స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ స్పందిస్తూ.. మార్చి 2026 నాటికి దేశంలో, ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పాన్ని బలోపేతం చేస్తూ.. భద్రతా దళాలు నిరంతరం విజయం సాధిస్తున్నాయని.. లక్ష్యం వైపు వేగంగా కదులుతున్నాయని అన్నారు. క్లిష్ట భౌగోళిక పరిస్థితులు, అనేక సవాళ్లు ఉన్నప్పటికీ వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయాత్మకంగా నారాయణపూర్‌లోని ఛత్తీస్‌గఢ్ పోలీసుల డీఆర్‌జీ యూనిట్ పూర్తి నిబద్ధత, దృఢ సంకల్పంతో పూర్తి చేస్తోందన్నారు. సైనికులు సాధించిన ఈ విజయం ప్రశంసనీయమని, వారి ధైర్యసాహసాలకు తాను సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఎన్‌కౌంటర్‌లో అమరుడైన జవాన్‌కు నివాళులర్పించారు. గాయపడ్డ వారంతా వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నన్ను పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలి..

**ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో జ్యోతి మల్హోత్రా చాటింగ్..!**



**తెలంగాణవీణ, న్యూఢిల్లి**

గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ కేసు దర్యాప్తును అధికారులు ముమ్మరం చేశారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఐఎస్ఐ హ్యాండ్లర్ తో జ్యోతి చాటింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో తనని పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలంటూ జ్యోతి కోరడం గమనార్హంఐఎస్ఐతో సంబంధాలున్న అలీ హసన్ అనే వ్యక్తితో జ్యోతి నిత్యం టచ్‌లో ఉంటున్నట్లు అధికారులు తమ దర్యాప్తులో ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి వీరిద్దరూ చర్చించుకున్నట్లు తేల్చారు. వాటిని రహస్యంగా ఉంచేందుకు పలు ఎన్‌క్రిప్ట్ చేసిన ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించినట్లు విచారణలో తేలింది. స్నాప్‌చాట్, టెలిగ్రామ్, వాట్సాప్‌లో కోడ్ ల్యాంగ్వేజ్‌లో మాట్లాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. భారతదేశ అండర్‌కవర్ ఆపరేషన్లకు సంబంధించి సంకేత భాషలో వారి మధ్య సాగిన సంభాషణలు దర్యాప్తు బృందానికి లభించాయి. చాటింగ్ సందర్భంగా 'నన్ను పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలి' అని జ్యోతి కోరింది. ఇందుకు సంబంధించిన చాటింగ్ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. మరోవైపు పాక్ ఇంటెలిజెన్స్ అధికారుల తో తనకు సంబంధాలున్నట్లు జ్యోతి అంగీకరించినట్లు తెలిసింది.

# మహిళ మృతదేహాన్ని వెలికితీసి.. సెల్ఫీ తీసుకున్న యువకుడు



**తెలంగాణవీణ, కోల్‌కతా**

ఒక యువకుడు పూడ్చిపెట్టిన మహిళ మృతదేహాన్ని వెలికితీశాడు. ఆ అస్థిపంజరంతో సెల్ఫీ తీసుకున్నాడు. ఇది చూసిన గ్రామస్తులు ఆగ్రహంతో రగిలిపోయారు. అతడ్ని పట్టుకుని కొట్టారు. అక్కడకు చేరుకున్న పోలీసులు అతి కష్టంతో గ్రామస్తుల దాడి నుంచి ఆ యువకుడ్ని కాపాడారు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కాంటాయ్ పరిధిలోని గ్రామానికి చెందిన ప్రభాకర్, ఏడేళ్ల కిందట పూడ్చిపెట్టిన మహిళ మృతదేహాన్ని వెలికితీశాడు. ఆ అస్థిపంజరంతో సెల్ఫీ తీసుకున్నాడు.కాగా, గ్రామస్తులు ఇది చూసి ఆగ్రహంతో రగిలిపోయారు. ప్రభాకర్‌ను పట్టుకుని కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయితే ప్రభాకర్‌ను పోలీసులకు అప్పగించేందుకు గ్రామస్తులు నిరాకరించారు. అతడ్ని కాపాడేందుకు ప్రయత్నించిన పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ ఘర్షణలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. మరోవైపు రెండు గంటల తర్వాత అక్కడి పరిస్థితిని పోలీసులు నియంత్రించారు. గ్రామస్తుల దాడి నుంచి ప్రభాకర్‌ను కాపాడారు. తీవ్రంగా గాయపడిన అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటనా స్థలంలో మద్యం సీసా లభించడంతో తాగిన అతడు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే సమాధి నుంచి మహిళ అస్థిపంజరాన్ని ఆ యువకుడు ఎందుకు బయటకు తీశాడో అన్నది తెలియలేదు.

# మల్కాజిగిరిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు...





ప్రజాప్రతినిధులు,అధికారులే అండా...?
-నింబధనలకు పాతర...

**తెలంగాణవీణ,మల్కాజిగిరి...**
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు కాలనీల్లో విచ్చల విడిగా అక్రమ నిర్మాణాల కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిథేలే అండగా నిలుస్తూ ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాజిగిరి ప్రధాన రహదారి పక్కనే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధే అండగా నిలిచి అన్ని తానై చక్రం తిప్పినట్లు ఆరొపనలున్నాయి. ఆదనపు అంతస్తు నిర్మాణాలు, రెసిడేన్షియల్ అనుమతులతో పక్కగా కమర్షియల్ నిర్మాణాలు చేపట్టడం ఇక్కడ సర్వసాధారమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. మౌలాలీ, మల్కాజిగిరి, గౌతంనగర్, నేరేడ్మేట్, వినాయక్ నగర్, ఈస్టుఆనంద్ బాగ్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో నిబంధనలను ఉల్లంఘిస్తు నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రామకిష్టాపురం ఫ్లఓర్ బ్రిడ్జి సమీపంలో మౌలాలీ ఎస్పీనగర్ చౌరస్తా, మల్కాజిగిరి ప్రధాన రహదారుల పక్కనే వెలుస్తున్న నిర్మాణాలపై అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. అక్రమ దందాలకు కొందరు ప్రజాప్రతినిధులే అండగా నిలుస్తున్నారనీ, వారి అండదండలతో దళారులు రెచ్చిపోతున్నారనీ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులు పెంచడం, సెట్బ్యాక్లను వదిలివేయకపోవడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడి అక్రమాలకు మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నారా లేక నిర్లక్ష్యం వహిస్తున్నారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు కళ్ళు మూసుకుని ఉండటంతోనే, అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్నది స్థానికుల ఆరొపిస్తున్నారు.


# రాజీవ్ గాంధీ భారత ప్రగతికి మార్గదర్శి



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా చేగుంట పట్టణ కేంద్రంలో దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశ ప్రగతికి మార్గ నిర్దేశకులని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ కుమార్ అన్నారు ఆయన 34వర్ధంతిని పురస్కరించుకొని చేగుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వడ్ల నవీన్ కుమార్, మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని 21వ శతాబ్దానికి తీసుకెళ్లిన ధార్మికుడనీ సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన గొప్ప నాయకుడనీ అలాగే భారతదేశానికి కంప్యూటర్ విధానాన్ని అందించిన గొప్ప మహానేత పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిది," అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు స్టాలిన్ నర్సింల, దుబ్బాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడ సయ్యద్, హుస్సేముద్దీన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, జైల్సింగ్ నాయక్, హరిచంద్ నాయక్.

# రూ.52 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు : కార్పొరేటర్ బన్నాల




**తెలంగాణ వీణ,ఉప్పల్.....**
చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఈస్ట్ కళ్యాణపురి కాలనీలో సుమారు రూ.52 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను జిహెచ్ఎంసి అధికారులు ఈ ఈ హరిలాల్ డి ఈ, ఎఈ ల తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ప్రతి సిసి రోడ్ వద్ద కాంట్రాక్టర్ లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు తరచూ పర్యవేక్షించాలని, సీసీ రోడ్ల లెవెల్స్ సరిగ్గా ఉండే విధంగా చూడాలని, అదేవిధంగా సీసీ రోడ్డు పూర్తయ్యేంతవరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్ బాలకృష్ణ గౌడ్, శ్యామ్, కాలనీ అధ్యక్షులు సతీష్, కాలనీ సభ్యులు రాజశేఖర్, రత్నకుమార్ ,భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

-స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి -ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**తెలంగాణవీణ,పరిగి:**
పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పిసిసి పరిశీలకులు వినోద్ రెడ్డి,రాంశెట్టి.నరేందర్ తో కలిసి పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు ఏకమై గెలుపే లక్ష్యంగా పని చేయాలని,ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలి.కష్టాల్లో కాంగ్రెస్ వెన్నంటి నడిచిన కార్యకర్తలే పార్టీకి బలం,పార్టీని నమ్ముకొని పని చేసిన నాయకులకు కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఏ విధంగా కష్టపడ్డారో,అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేసి 100 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను కార్యకర్తలు తిప్పి కొట్టాలి.పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ,కేసీఆర్ చేసిన ఆర్థిక విధ్వంసం,దోపిడీ, రాష్ట్రాన్ని మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ ఏ&బి అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,మండలాల పార్టీ అధ్యక్షులు,మాజీ జడ్పీటీసీలు-ఎంపిలు,పీఏసిస్ చైర్మన్లు,జిల్లా కమిటీ అనుబంధ కమిటీ ల అధ్యక్షులు, మహిళ కమిటీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆగ్రో రైతుసేవా కేంద్రం గండీడ్




**తెలంగాణవీణ,గండీడ్**
మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో ఆగ్రోరైతు సేవా కేంద్రంలో జనుము జీలగా పచ్చిరొట్టె విత్తనాల రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏ ఓ రాంపాల్ మాట్లాడుతూ జనుము విత్తనాలు 50 క్వింటాల్లు జీలుగ విత్తనాలు 40 క్వింటాళ్ల అందుబాటులో ఉన్నాయి. జనుము 40 కిలోల బస్త. 2510/- రూపాయలు. జీలుగా 30 కిలోల బస్తా 2140/- రూపాయలు అన్నారు. కార్యక్రమంలో. ఏవో రాంపాల్, పి ఎ సి ఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వెన్నచెడ్ మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, పులిధర్ రెడ్డి, శరణప్ప, అగ్రోస్ నిర్వాహకులు శ్రీనయ్య మరియు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు

# అనుమతులు లేని ప్రయివేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలి

-డిఈ ఓ కార్యాలయంలో వినతి పత్రం అందించిన భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్



**తెలంగాణవీణ,సిరిసిల్ల...**
రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించి అడ్మిషన్స్ తీసుకుంటున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల పుట్టుకోస్తున్నాయని అన్నారు..పర్మిషన్ రాక ముందే ఆయా పాఠశాలల గురించి సోషల్ మీడియాలో , హోర్డింగ్ ద్వారా, కరపత్రాలు ద్వారా ప్రచారాలు నిర్వహిస్తున్నారని.. అలాగే సమ్మర్ క్యాంప్ పేరు చెప్పి క్యాంపు కు వచ్చిన వారికి అడ్మిషన్ ఫీజు ఫ్రి అంటూ పిల్లల తల్లి దండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు, ఇదంతా అధికారుల నిర్లక్ష్యం వల్లనే వారి పర్యవేక్షణ లోపం వల్లనే ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు ఇష్టనుసారంగా వ్యవరిస్తున్నారని అన్నారు, అలాగే కొన్ని ప్రయివేట్ పాఠశాలలు సెకండ్ బ్రాంచ్ పేరు మిద వేరువేరు భవనాలలో క్లాస్ లు నడిపిస్తున్నారు అని ఇదంతా అధికారులు చూసి చూడ నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటి అయిన అధికారులు అనుమతి లేని పాఠశాలాల పైన మరియు ఇష్టను సారంగా తొక పేర్లు తగిలిచ్చుకొని వేలల్లో పిజులు వసూలు చేస్తున్న ,పాఠశాల పై చర్యలు తీసుకోవాలనీ కోరారు లేని పక్షములో ఆయా పాఠశాలల ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో రంజిత్.మధు.సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి...





**తెలంగాణ వీణ/తార్నాక:**
మన దేశ భవిష్యత్తుకు మార్గదర్శకత్వాన్ని చూపించిన దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా, గ్రేటర్ హైదరాబాద్ నగర గౌరవ డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి మరియు టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి కలిసి, మనికేశవ్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, శ్రీ రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఐటి విప్లవం, పంచాయతీ రాజ్ వ్యవస్థను బలపరచడం, యువత సాధికారత, సాంకేతికతపై దృష్టి పెట్టడం వంటి ప్రగతిశీల దృక్పథం నేటి భారత ఆర్థిక, సాంకేతిక రంగాలకు మేల్కొలిపిన ప్రేరణగా నిలిచాయని వివరించారు. టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ, "రాజీవ్ గాంధీ ధైర్యసాహసాలు, యువతపై నమ్మకం ఆయనను సమకాలీన నాయకులలో ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఆయన సేవలు యువతకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తార్నాక డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ వేముల శ్రీనివాస్, కే నర్సింహ,వెంకటేష్, లింగయ్య, జి వెంకటేష్,వి రవి,ఎస్ అశోక్,బి శ్రీనివాస్, కార్యకర్తలు, మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓయూ జేఏసీ నూతన కమిటీ ని నియమించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**తెలంగాణ వీణ/ఓయూ:**
ఉస్మానియా యూనివర్సిటీ లో వివిధ కళాశాలలో ఓయూ జేఏసీ ప్రెసిడెంట్, కార్యదర్శులను నియమించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి. ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ నేరెళ్ల చరణ్, వైస్ ప్రెసిడెంట్ నందకిషోర్, వైస్ ప్రెసిడెంట్ హరీష్,ఇంజనీరింగ్ కాలేజ్ ప్రెసిడెంట్ బానోత్ ఉమేష్, ఇంజనీరింగ్ సెక్రటరీ బానోత్ నవీన్, ఓయూ సెక్రెటరీ అరుణ్, ఓయూ టెక్నాలజీ కాలేజీ ప్రెసిడెంట్ కరుణాకర్, టెక్నాలజీ కాలేజ్ ఇంచార్జ్ అజిత్, జనరల్ సెక్రెటరీ పరమేష్ లను నియమిస్తూ నియామక పత్రాలను అందజేసిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి. నూతనంగా నియమించిన అధ్యక్షులు కార్యదర్శులు రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థి సమస్యల పైన పోరాటం చేస్తామని, ఈ సందర్భంగా తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ రఘునందన్ రావు



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట పట్టణ కేంద్రంలోని వడియారం లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంద్రు సుధాకర్ కూతురు హారిక, నవీన్ కుమార్, వివాహ వేడుకల్లో పాల్గొన్న మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు నూతన వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం గణేష్ రవికుమార్, దుబ్బాక అసెంబ్లీ కో కన్వీనర్ చిలకమర్రి గోవింద్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కుమ్మరి నర్సింలు, సీనియర్ నాయకులు చింతాల భూపాల్, మాజీ జెడ్పిటిసి కరణం పాండు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో అంగన్వాడిలలో అవినీతి కోరలునిధుల దోపిడి,

**తెలంగాణవీణ,నిర్మల్....**
నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణీ స్త్రీల పోషకాహారం కోసంప్రత్యేకంగా కేటాయిస్తున్న నిధులు అంగన్వాడి వ్యవస్థలో కొందరి స్వార్థానికి బలైపోతున్నాయి. నిర్మల్ జిల్లాలో జరుగుతున్న దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. అంగన్వాడి కేంద్రాల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇస్తున్న 12,000 ప్రత్యేక నిధుల్లో సిడిపిఓలు ఏకంగా 2,000 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు. అంతేకాదు, ఈ అక్రమ డిమాండ్ను వ్యతిరేకించిన అంగన్వాడి టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వం పేదల కోసం ఉద్దేశించిన నిధులను కొందరు అధికారులు తమ సొంత జేబులు నింపుకోవడానికి దుకుంటుండటం సిగ్గుచేటు. అంగన్వాడి టీచర్లు, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ, సమాజంలోని బలహీన వర్గాలకు సేవలు అందిస్తున్నారు. అలాంటి వారిని సైతం బెదిరించి




డబ్బు వసూలు చేయడం అత్యంత హేయమైన చర్య. సిడిపిఓలఈ దుశ్చర్య వారి అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా ప్రభుత్వం శ్రీమంతం వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం 12,000 ఇస్తుంటే, అదనంగా 22,000 ఎందుకు వసూలు చేస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఈ అక్రమ వసూళ్ల వెనుక ఉన్న అసలు కారణాలేమిటి? వసూలు చేసిన డబ్బు ఎక్కడికి వెళ్తుంది? దీనిపై పర్యవేక్షణ ఎందుకు లేదు?

అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మరోవైపు, డబ్బు ఇవ్వని టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు మరింత దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. తమ హక్కుల కోసం నిలబడే వారిని బెదిరించడం, వేధించడం ద్వారా వ్యవస్థలో నిశ్శబ్దాన్ని నెలకొల్పాలని చూడటం నియంతృత్వ పోకడలను తలపిస్తోంది. ఇది అంగన్వాడి టీచర్ల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుంది.

# మత స్వేచ్ఛ భారత రాజ్యాంగం ద్వారా భారత పౌరుడికి ఉండే ఒక ప్రాథమిక హక్కు

**-బిషప్ దుర్గం ప్రభాకర్-తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు**
**-రెవ.జాన్ బెన్ని లింగం-ఏ. ఐ. సి. సి. జాతీయ అధ్యక్షులు**
**-రెవ. డా. గడ్డం డేవిడ్ రాజు -సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు**



**తెలంగాణవీణ,సూర్యాపేట...**
ఆత్మకూర్ (యస్) మండల కేంద్రం లోని పాతర్లపహాడ్ గ్రామం లో బేతెస్థ ప్రార్థన మందిరం (డబ్ల్యూ. యం. ఇ) చర్చ్ లో ఆత్మకూర్ యస్ మండల అధ్యక్షులు రెవ. డా. గుంటూరు శాంతాయ్య, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్ ఆధ్వర్యంలో క్రైస్తవ హక్కుల అవగాహనా సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రెవ. జాన్ బెన్ని లింగం ఏ. ఐ. సి. సి. జాతీయ అధ్యక్షులు, బిషప్ దుర్గం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం మత స్వేచ్ఛ హక్కు అనేది ప్రతి ఒక్కరూ తమ మతాన్ని స్వేచ్ఛగా అనుసరించడానికి, ఆచరించడానికి, ప్రచారం చేయడానికి హక్కు కల్పించే ప్రాథమిక హక్కు.ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25-28 ద్వారా రక్షించబడుతుందనీ.మత స్వేచ్ఛ హక్కు యొక్క అంశాలు మనస్సాక్షి స్వేచ్ఛ ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మతాన్ని అనుసరించడానికి లేదా అనుసరించకపోవడానికి హక్కు కలిగి ఉంది మతాన్ని ప్రకటించే, ఆచరించే మరియు ప్రచారం చేసే హక్కు మతాలను బహిరంగంగా ప్రకటించడానికి ,ఆచరించడానికి మరియు ప్రచారం చేయడానికి హక్కు ఉంది మత సంస్థలను నిర్వహించే హక్కు ప్రతి మతం తన స్వంత మత సంస్థలను స్థాపించవచ్చు ననీ, నిర్వహించుకోవచ్చు ప్రభుత్వ జోక్యం లేకపోవటం మతం లేదా మతపరమైన నమ్మకాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేయకూడదు ప్రజా క్రమం,నైతికత మరియు ఆరోగ్యం ఈ హక్కులు ప్రజా క్రమం,నైతికత మరియు ఆరోగ్యానికి లోబడి ఉంటాయి వివక్ష లేకపోవుట మతం ఆధారంగా ఎవరూ వివక్షకు గురికాకూడదు మత స్వేచ్ఛ హక్కు యొక్క పరిమితులు కొన్ని సందర్భాల్లో మత స్వేచ్ఛ హక్కుకు పరిమితులు విధించబడవచ్చు ఉదాహరణకు, మతం పేరుతో ప్రజల హక్కులకు భంగం కలిగించకూడదు లేదా సామాజిక క్రమానికి విరుద్ధంగా వ్యవహరించకూడదు మత స్వేచ్ఛ హక్కు యొక్క ప్రాముఖ్యత సమాజంలో వైవిధ్యం మత స్వేచ్ఛ హక్కు ప్రజలందరూ తమకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కల్పిస్తుందనీ,ఇది సమాజంలో వైవిధ్యం మరియు సహనం నెలకొల్పడానికి దోహదపడుతుంది ప్రజాస్వామ్య విలువలు మత స్వేచ్ఛ హక్కు ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన అంశం, ఎందుకంటే ఇది ప్రజలకు వారి నమ్మకాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే హక్కును కల్పిస్తుంది.ప్రాథమిక హక్కు మత స్వేచ్ఛ హక్కు భారత రాజ్యాంగం ద్వారా రక్షించబడిన ప్రాథమిక హక్కు, అంటే ఇది ఒక పౌరుడికి ఉండే ఒక ప్రాథమిక హక్కు.ఈ కార్యక్రమంలో రెవ. డా. గడ్డం డేవిడ్ రాజు,కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. వి. యెషయా,హుజూర్నగర్ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు రెవ. మీసా దేవసహాయం, హుజూర్నగర్ నియోజకవర్గ చైర్మన్ రెవ.తలకప్పాల దయాకర్, రెవ.ఏర్పుల క్రిస్టోఫర్, రెవ. పంది మార్క్, ఈ. రాజేష్, యం సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు

# మనదేశ సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ

**తెలంగాణవీణ,పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని...**
ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్లోని 9 ఉగ్రవాదస్థావరాలను భారత సైనికులు అత్యంత చాకచక్యంగా, సమర్థంగా ధ్వంసం చేశారు.భూషిపాక సంతోష్ మహారాజ్ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుమన దేశ సైనికులకు సంఘీభావంగా మంగళవారం సాయంత్రం ఎన్ టి పి సి అన్నపూర్ణ కాలనీ గవర్నమెంట్ స్కూల్ నుండి ఎఫ్సీఐ, ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ కూడలి వరకు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ విజయవంతం అనంతరం ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భూషిపాక సంతోష్ మహారాజ్ మాట్లాడుతూ "ఏప్రిల్ 22న జమ్మూ-కశ్మీర్లోని పహల్గాంలో పర్యాటకులపై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడిచేసి 26 మందిని అత్యంత క్రూరంగా కాల్చిచంపేశారు. దేశ సమగ్రతకు సవాల్గా నిలిచిన ఈ ఘటనకు కారణమైన వారిని వదిలిపెట్టేదిలేదని, ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని భారత ప్రధాని నరేంద్ర మోదీ గట్టి హెచ్చరిక చేశారు. అనంతరం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్లోని 9 ఉగ్రవాదస్థావరాలను భారత సైనికులు అత్యంత చాకచక్యంగా, సమర్థంగా ధ్వంసం చేశారు.సింధూ నది జలాలను నిలిపేసి పాక్కు భారత్ గట్టిగా




బుద్ధి చెప్పింది. గతంలో ఉగ్రదాడుల తర్వాత కేవలం క్యాండిల్ వెలిగించి నివాళు లు అర్పించి వదిలేసేవారు. ఇప్పుడు భారతదేశం అంటే ఉగ్రవాదులకు భయం పుట్టాలనేలా ప్రధాని మోదీ గట్టి సమాధానమిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీని నిర్వహించాం. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం,హిందూ సంస్థలు,వివిధ క్షేత్ర రాజకీయ నాయకులు,వ్యాపారస్తులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని,విజయవంతం చేశారు,

# బిజినెస్

# పసిడి ప్రియులకు షాక్..

## వరుస నష్టాలకు బ్రేక్ ..

### 400 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్




**తెలంగాణవీణ, బిజినెస్**

వరుసగా మూడు రోజులుగా నష్టపోతున్న స్టాక్ మార్కెట్ బుధవారం లాభాల బాటలో సాగింది. ఫార్మా, రియాల్టీ షేర్లు లాభాల బాటలో సాగడం దేశీయ సూచీలకు కలిసివచ్చింది. అలాగే ఆటో, బ్యాంక్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు కూడా లాభపడ్డాయి. అయితే విదేశీ మదుపర్ల అమ్మకాలు తగ్గకపోవడం కాస్త ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఓ దశలో భారీగా లాభపడిన సూచీలు చివరకు ఓ మోస్తారు లాభాలతో రోజును ముగించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముగిశాయి.మంగళవారం ముగింపు (81, 186)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో 800 పాయింట్లకు పైగా లాభపడి 82, 021 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలయ్యాయి. దీంతో సెన్సెక్స్ కిందకు దిగి వచ్చింది. చివరకు 410 పాయింట్ల లాభంతో 81, 596 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 129 పాయింట్ల లాభంతో 24, 813 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్, సీమన్స్, సోలార్ ఇండస్ట్రీస్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఆదిత్య బిర్లా ఫేషన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇండస్ ఇండ్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 436 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 197 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో

### ఒక్కరోజులోనే భారీగా పెరిగిన బంగారం ధరలు..

**తెలంగాణవీణ, బిజినెస్**

గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత అంతగా దూకుడు కొనసాగించలేదు. ఆ తర్వాత ధరలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి.. ఈ క్రమంలోనే మంగళవారం తగ్గిన బంగారం ధరలు.. బుధవారం భారీగా పెరిగాయి.. ఒక్కరోజే పసిడి ధర దాదాపుగా రూ.2400 పెరిగింది. లక్ష మార్కు దాటిన తర్వాత.. నెల వ్యవధిలో ధరలు ఇంతలా పెరగడం ఇదే మొదటిసారి.. బుధవారం బులియన్ మార్కెట్ ప్రకారం..24 క్యారెట్ల పసిడి ధర పది గ్రాములపై రూ.2400 మేర ధర పెరిగి రూ.97,420 గా ఉంది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 2,200



మేర ధ పెరిగి రూ.89,300 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.100 మేర ధర తగ్గి.. రూ.96,900 లుగా ఉంది.

**బంగారం, వెండి ధరలు..**

హైదరాబాద్ లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.1,07,900లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,300లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,07,900లుగా ఉంది.

ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.89,450, 24 క్యారెట్ల ధర రూ.97,570 గా ఉంది.

ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది.

చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల రేటు రూ.97,420 గా ఉంది.

బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.89,300, 24 క్యారెట్ల ధర రూ.97,420 గా ఉంది.

## మార్కెట్‌లోకి కొత్త రూ.20 నోట్లు? అది ఒక్కటే అసలు మార్పు

**తెలంగాణవీణ, బిజినెస్**

20 రూపాయల నోటు అంటే ప్రజలు అధికంగా ఉపయోగించే చిన్న-విలువ నోట్లలో ఒకటి. అలాగే ఈ నోటులో భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని జరుపుకునే వెనుక వైపున ఎల్లోరా గుహలు వంటి మూలాంశాలతో ఉంటుంది. అయితే ఈ నోటు ఆకుపచ్చ, పసుపు కాంబినేషన్‌లో ఉంటుంది.మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లో గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన రూ.20 డినామినేషన్ నోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు చెబుతున్నారు.మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్ కింద ఇప్పటికే చెలామణిలో ఉన్న రూ.



20 నోట్ల డిజైన్ ఒకేలా ఉంటుందని, ప్రజలకు సులభంగా గుర్తించేలా ఉంటాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. కేవలం గవర్నర్ సంతకం మార్పుతోనే ఈ నోట్లు విడుదలకానున్నాయి. ఈ మేరకు ఆర్‌బీ మే 17న ఓ ప్రకటన విడుదల చేసిందికొత్త నోట్ల జారీ నేపథ్యంలో గతంలో రిజర్వ్ బ్యాంక్ జారీ చేసిన అన్ని రూ.20 డినామినేషన్ నోట్లు చట్టబద్ధంగా చెలామణిలో కొనసాగుతాయని కూడా స్పష్టం చేసింది.ఆర్‌బీఐ గవర్నర్ మారినప్పుడల్లా ఈ జారీ ప్రామాణిక ప్రోటోకాల్‌ను అనుసరిస్తుంది. అప్‌డేటెడ్ నోట్లు ప్రస్తుత గవర్నర్ సంతకంతో ఉంటాయి. సంజయ్ మల్హోత్రా డిసెంబర్ 2024లో భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

# ధోని సేన పేరిట చెత్త రికార్డ్..

### 3 ఏళ్ల తర్వాత ఇలాంటి పరిస్థితిలో చెన్నై.. అదేంటంటే?

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఐపీఎల్ 2025 సీజన్ చెన్నై సూపర్ కింగ్స్ కు చాలా దారుణంగా ఉంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఐపీఎల్ 18వ సీజన్‌లో 10వ ఓటమిని చవిచూసింది. ఇది చెన్నైకి ఒక సీజన్‌లో అత్యధిక ఓటములకు రికార్డుగా నిలిచింది. ఈ సంవత్సరం చెన్నై జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించడంలో విఫలమైంది. ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించిన మొదటి జట్టుగా చెన్నై నిలిచింది. ఇప్పుడు చెన్నై జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

**రెండోసారి 10 మ్యాచ్‌ల్లో ఓటమి..**

చెన్నై సూపర్ కింగ్స్ ఒక సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో ఓడిపోవడం ఇది రెండోసారి. ఇంతకు ముందు ఇది 2022 లో జరిగింది. అప్పుడు కూడా చెన్నై జట్టు 10 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 2012, 2020లో చెన్నై జట్టు ఎనిమిది మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈ సంవత్సరం చెన్నై జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ



బలహీనంగా ఉంది. కొంతమంది ఆటగాళ్ళు గాయపడ్డారు. వారు నిలకడగా రాణించలేకపోయారు. కీలక సమయాల్లో జట్టు తన బలాన్ని ప్రదర్శించడంలో విఫలమైంది.

**చివరి స్థానంలో నిలిచే ప్రమాదం..**


చెన్నై జట్టు గుజరాత్ టైటాన్స్‌తో ఒక మ్యాచ్ ఆడాల్సి ఉంది. చెన్నై అత్యధిక పరాజయాల రికార్డును సృష్టించే ప్రమాదంలో ఉంది. అలాగే, చెన్నై ??జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచే అవకాశం ఉంది. దీన్ని నివారించడానికి అగ్రశ్రేణి జట్టుపై భారీ విజయాన్ని సాధించాల్సి ఉంటుంది. చెన్నై నెట్ రన్ రేట్ రాజస్థాన్ రాయల్స్ కంటే చాలా దారుణంగా ఉంది. రాజస్థాన్ రాయల్స్ తమ సీజన్‌ను మంచి ప్రదర్శనతో ముగించింది.

**ధోని కెప్టెన్సీ కూడా పని చేయలే..**

సీజన్ ప్రారంభంలో రుతురాజ్ గైక్వాడ్ చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఆ తర్వాత అతను గాయపడి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. దీని తరువాత కెప్టెన్సీ మహేంద్ర సింగ్ ధోని చేతుల్లోకి వచ్చింది. మహి మ్యాజిక్ పనిచేయలేదు. చెన్నై నిరాశపరిచే ప్రదర్శన కొనసాగింది. చెన్నై జట్టు విజయంతో లీగ్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత వరుసగా 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఆ తర్వాత లక్నోను ఓడించింది. దీని తర్వాత వరుసగా 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కోల్‌కతాను ఓడించిన తర్వాత చెన్నై జట్టు రాజస్థాన్ చేతిలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది.

# స్పోర్ట్స్

## ప్లే ఆఫ్స్‌కు ముందే ఆర్‌సీబీకి గుడ్‌న్యూస్.. ఊరమాస్ ప్లేయర్ ఎంట్రీ..?




**తెలంగాణవీణ, క్రీడలు :**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేసర్ జోష్ హాజెల్‌వుడ్ ఐపీఎల్‌లోని మిగిలిన మ్యాచ్‌ల కోసం భారతదేశానికి తిరిగి రానున్నాడు. ఇండో-పాక్ యుద్ధం భయంతో ఐపీఎల్ నిలిపివేసిన తర్వాత హాజిల్‌వుడ్ స్వదేశానికి తిరిగి వెళ్లాడు.ఇదిలా ఉండగా, ఐపీఎల్ తిరిగి ప్రారంభమైనప్పటికీ, జోష్ హేజిల్‌వుడ్ ఆర్‌సీబీ జట్టులో చేరలేదు. దీనికి ప్రధాన కారణం భుజం నొప్పి. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భుజం గాయానికి గురైన హేజిల్‌వుడ్.. సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో ఆడలేదు.దీని అర్థం జోష్ హాజిల్‌వుడ్ మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌కు కూడా అందుబాటులో ఉండడు. మే 25న అతను ఆర్‌సీబీ జట్టులో చేరితే, మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడవచ్చు.ఇంతలో, జోష్ హేజిల్‌వుడ్ పునరాగమన వార్త ఆర్‌సీబీకి శుభసూచకంగా పరిగణించనున్నారు. ఎందుకంటే ఈసారి ఆర్‌సీబీ తరపున హేజిల్‌వుడ్ అత్యధిక వికెట్లు పడగొట్టాడు. ఈ ఆసీస్ పేసర్ 10 మ్యాచ్‌ల్లో 36.5 ఓవర్లు బౌలింగ్ చేసి మొత్తం 18 వికెట్లు పడగొట్టాడు.ఆర్‌సీబీ తరపున అత్యధిక డాట్ బాల్స్ వేసిన ఆటగాడిగా జోష్ హేజిల్‌వుడ్ నిలిచాడు. అతను 10 మ్యాచ్‌ల్లో మొత్తం 103 డాట్ బాల్స్ వేశాడు. ఈ విధంగా, అతను ఆర్‌సీబీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు, ప్లేఆఫ్‌లకు ముందు జోష్ హాజిల్‌వుడ్ ఆర్‌సీబీ జట్టులో చేరడం ఖాయం. ఇది రాయల్స్ బౌలింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తుంది.

# ఢిల్లీని ముంచిన సూర్య, శాంట్నర్.. ప్లే ఆఫ్స్‌లో ముంబై..

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. వాంఖడే స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ ను చిత్తు చేసి చివరి బెర్తును కైవసం చేసుకుంది. మొదట సూర్యకుమార్ యాదవ్(73 నాటౌట్) మెరుపు అర్ధశతకంతో భారీ స్కోర్ చేసిన ముంబై.. ఆ తర్వాత ప్రత్యర్థిని వణికించింది. పేసర్లు టాపార్డర్‌ను కూల్చగా.. స్పిన్నర్ మిచెల్ శాంట్నర్(3-11) సంచలన స్పెల్‌తో ఢిల్లీ మిడిలార్డర్ పని పట్టాడు. ముస్తాఫిజుర్‌ను బుమ్రా(3-12) బౌల్డ్ చేయడంతో 59 పరుగుల తేడాతో ముంబై



జయకేతనం ఎగురవేసింది. దాంతో. నాకౌట్ పోరుకు దూసుకెళ్లాలనుకున్న ఢిల్లీ ఆశలు ఆవిరయ్యాయి.వాంఖడేలో ముంబై ఇండియన్స్ విజయగర్జనతో ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టింది. వరుసగా రెండు ఓటములు.. ఆపై కోల్‌కతాపై విజయం.. అనంతరం ఆర్సీబీ చేతిలో ఓటమి.. ఆనక వరుసగా ఆరేసి విక్టరీలతో ప్లే ఆఫ్స్ బరిలో నిలిచిన ముంబై.. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌ను నాకౌట్ చేసింది.



తెలంగాణ వీణ
నిజం నిర్భయ తంబుర్రా..

# సినిమా

గురువారం మే 22 2025







## మోహన్ లాల్ బర్త్ డే స్పెషల్.. కన్నప్పపై హైప్ పెంచేస్తోన్న కిరాట ఎంట్రీ

తెలంగాణవీణ, సినిమా :
టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ప్రాజెక్ట్ కన్నప్ప . ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్‌తోపాటు కీ రోల్స్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్ లాల్ కిరాట పాత్రలో నటిస్తున్నాడు. పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా మోహన్ లాల్‌కు మేకర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ వీడియో విడుదల చేశారు. మోహన్ లాల్ కిరాట అవతారంలో విల్లు చేతబట్టి తన సైన్యంతో కొండల్లో నుంచి నడుచుకుంటూ వస్తోన్న విజువల్స్ సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. కిరాట పాత్ర సినిమాలో చాలా కీలకంగా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. కన్నప్ప చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. కన్నప్ప మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన్'లో కీర్తి సురేష్?

తెలంగాణవీణ, సినిమా :
"మహానటి" చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్, తన పాత్రల ఎంపికలో కొత్త ధోరణిని అనుసరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకున్న కీర్తి, ఇప్పుడు తన "వెర్షన్ 2.0"ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుకు కారణం విజయ్ దేవరకొండతో ఆమె నటించబోయే సినిమా 'రౌడీ జనార్దన్'తాజా సమాచారం ప్రకారం, రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో కీర్తి సురేష్ రొమాంటిక్ పాత్రలో కనిపించబోతోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండతో లిప్ లాక్ సన్నివేశాలు కూడా ఉండవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు కీర్తి సురేష్ ఏ హీరోతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించలేదు. 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబుతో రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పూర్తిస్థాయి లిప్ లాక్ లేదు. అయితే, 'రౌడీ జనార్దన్'లో మాత్రం ఇది నిజం కావచ్చని అంచనా వేస్తున్నారు. కీర్తి సురేష్ తన కెరీర్‌లో ప్రయోగాలు చేయడానికి వెనుకాడదు. బాలీవుడ్‌లో 'బేబీ జాన్'తో అడుగుపెట్టినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. అయితే, ఆమెకు అక్కడ కూడా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. నెట్‌ఫ్లిక్స్ కోసం 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో బోల్డ్‌గా నటించబోతున్నట్లు తెలుస్తుంది. పాత పద్ధతిలో వెళితే పని అవ్వదని గ్రహించిన ఈ అమ్మడు రూట్ మార్చినట్లు తెలుస్తుంది. ఇక రౌడీ జనార్దన్ సినిమా విషయానికి వస్తే.. ఇది ఒక మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండకు 'రౌడీ' ఇమేజ్ ఉండటంతో, ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమా గోదావరి జిల్లాల నేపథ్యంలో, స్థానిక రాజకీయాల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.




## ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ టైం వచ్చేసింది




తెలంగాణవీణ, సినిమా :
ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్టందుకుంది నిధి అగర్వాల్ .ఆ తర్వాత పలు సినిమాల్లో నటించినా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ఈ బ్యూటీ ప్రస్తుతం రెండు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో నటిస్తుందని తెలిసిందే. వీటిలో ఒకటి పవన్ కల్యాణ్ నటిస్తోన్న హరిహరవీరమల్లు కాగా.. మరోవైపు ప్రభాస్ టైటిల్ రోల్ పోషిస్తున్న రాజాసాబ్.ముందుగా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారం ఈ సినిమాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇక ఈ రెండు ప్రాజెక్టులపై పూర్తి ఆశలు పెట్టుకున్న నిధి అగర్వాల్‌కు వరుస వాయిదాలు నిరాశనే మిగులుస్తూ వస్తున్నాయి. హరిహరవీరమల్లు రీషెడ్యూల్ చేయడంతో నిధి అగర్వాల్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టైం రానే వచ్చింది. ఫైనల్‌గా నిధి అగర్వాల్ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టేసింది. మే 21న కొత్త పాట లాంచ్‌తో ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. నిధి అగర్వాల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉండి ప్రమోషన్స్‌పైనే ఫోకస్ పెట్టినట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. హరిహరవీమల్లు నాలుగేళ్లుగా సెట్స్‌పై కొనసాగుతుండగా.. నిధి తన కెరీర్‌లో అగ్రభాగం ఈ ప్రాజెక్టుకే కేటాయించింది. మొత్తానికి ఇన్నాళ్ల తర్వాత తమ అభిమాన నటి నిధి అగర్వాల్ మళ్లీ ప్రేక్షకులతో ఇంటరాక్ట్ అవుతుండటంతో అభిమానులు, ఫాలోవర్లు ఆనందంలో మునిగితేలుతున్నారు.

## క్రేజీ ఛాన్స్ కొట్టేసిన కన్నడ బ్యూటీ..

తెలంగాణవీణ, సినిమా :
కన్నడ హీరో రక్షిత్ శెట్టి నటించిన సప్త సాగారాలు దాచే ఎల్లో సైడ్ ఏ, బీ సినిమాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ రుక్మిణి వసంత్. ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో తుఫానులా దూసుకెళ్తుంది. వరుసగా అవకాశాలు అందుకుంటూ బిజీగా ఉంటుంది.ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో రాబోతున్న ప్రాజెక్టులో ఈ ముద్దుగుమ్మ ఎంపికైందని సమాచారం. అయితే ఈ విషయం గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.అలాగే తమిళంలో విజయ్ సేతుపతి నటించిన ఏస్, మదరాసి చిత్రాల్లో నటిస్తుంది. తాజాగా ఈ అమ్మడు మరో క్రేజీ ఛాన్స్ కొట్టేసినట్లు టాక్ వినిపిస్తుంది. థగ్ లైఫ్ సినిమా తర్వాత మణిరత్నం మరో రొమాంటిక్ చిత్రాన్ని ప్లాన్ చేశారట.అందులో హీరోగా నవీన్ పోలిశెట్టి నటించనున్నారని సమాచారం. ఇక ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా ఎంపిక చేశారని సమాచారం. ఈ విషయం గురించి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు కానీ ఫిల్మ్ వర్గాల్లో మాత్రం ఎక్కువగా టాక్ నడుస్తోంది.ఇక ఇదే నిజమైతే.. అటు ఎన్టీఆర్ సినిమాతోపాటు ఇప్పుడు తెలుగులో మణిరత్నం సినిమాతో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారనుంది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది ఈ హీరోయిన్. కన్నడ భాషతో కెరీర్ స్టార్ట్ చేసి ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేస్తుంది.







## త్రిష నవ్వుకు దాసోహమవ్వాల్సిందే.. ట్రెండింగ్‌లో ప్రమోషనల్ స్టిల్స్

తెలంగాణవీణ, సినిమా :
నాలుగు పదుల వయస్సుదాటినా రెండు దశాబ్దాలకుపైగా సినీ ప్రయాణంలో వన్నె తరగని అందంతో కుర్రకారు మతులు పోగొడుతోంది చెన్నై చంద్రం త్రిష . తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తూ ఇండియాలోనే వన్ ఆఫ్ ది టాప్ స్టార్‌గా కొనసాగుతోంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ స్టార్ హీరోయిన్ ప్రస్తుతం థగ్ లైఫ్ సినిమాలో నటిస్తుందని తెలిసిందే.జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. థగ్ లైఫ్ ప్రమోషనల్ ఈవెంట్‌లో త్రిష సూపర్ స్లిమ్‌గా కనిపిస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫ్లోరల్ డిజైన్‌డ్ ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో స్టేజీపై చిరునవ్వులు చిందిస్తూ అందరి మనసులను కొల్లగొట్టేస్తుంది. త్రిష స్టిల్స్, వీడియోలు ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. వాటిపై మీరూ ఓ లుక్కేయండి.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written